పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

అభివృద్ధిని చూసే చేరికలు

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- బీఆర్ఎస్‌లో 50 మంది చేరిక

బెల్లంపల్లి, అక్టోబర్ 18 : బెల్లంపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 34వ వార్డుకు చెందిన 50 మంది కాంగ్రెస్, ఎన్‌సీపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం స్థానికంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వారికి ఎమ్మెల్యే చిన్నయ్య కడువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో ఈ సారి బీఆర్ఎస్ పార్టీ అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూనెటి సత్యనారాయణ, ఎరుకల సుందర్‌రావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కౌన్సిలర్ ఇంట్లో 59 చీరలు స్వాధీనం

గర్మిళ్ల, అక్టోబర్ 18 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని 3వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఎస్‌కే.అబ్దుల్ మజాద్ ఇంట్లో ఎలక్షన్ స్క్వాడ్ మధుకర్.. పోలీసులతో కలిసి బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఆయన ఇంట్లో నిల్వ ఉంచిన 59 చీరలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని సీజ్ చేశారు. పట్టణ ఎస్సై రాజేందర్, సిబ్బంది ఉన్నారు.

కౌన్సిలర్ ఇంట్లో తనిఖీ చేస్తున్న ఎలక్షన్ స్క్వాడ్

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ఆసిఫాబాద్ అభ్యర్థి కోవ లక్ష్మి
- వాంకిడి మండలం మహాగాం.., రెబ్బెన మండలం రాంపూర్, నవ్వేగాం, వంకులం, రాళ్లపేట గ్రామాల్లో ప్రచారం

రెబ్బెన : రాంపూర్ జీపీలో సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి

వాంకిడి, అక్టోబర్ 18 : ఏజెన్సీ వాసిగా ఆసిఫాబాద్ నియోజకవర్గంపై పూర్తిగా అవగాహన ఉన్నదని, ఎన్నికల్లో గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి అన్నారు. వాంకిడి మండలం సోనాపూర్ పంచాయతీ పరిధి మహాగాంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. ముందుగా హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మహాగాం, గోయెగాం, రాజుల్‌గూడ, చినుపటేల్‌గూడ, సోనాపూర్, చిచ్చుపల్లి, పూనగూడ, మచ్చిగూడ, గణేశ్‌పూర్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజలతో మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాడ్డాక సంక్షేమ పథకాలు అన్నివర్గాల ప్రజలకు అందాయని, అందుకే మూడోసారి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో గిరిజన రైతులకు ఇటీవల పోడు పట్టాలు ఇవ్వడం, గ్రామాల అభివృద్ధితో పాటు, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉన్నదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆసిఫాబాద్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ 60 ఏండ్ల పాలనలో ఏం చేసిందని అన్నారు. అంతకు ముందు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టో ప్రజల ఆకాంక్షలకు అద్దంపట్టిందన్నారు. కేసీఆర్ బీమా బీపీఎల్ కుటుంబాల పేదలకు ధీమా కల్పించేలా ఉన్నదని తెలిపారు. దళితబంధు, గృహలక్ష్మి యథావిధిగా అమలు చేయడంతో పాటు రైతు బంధును, ఆసరా పింఛన్లను పెంచడం గొప్ప విషయమన్నారు. సకల జనం మెచ్చేలా ఉన్నదని తెలిపారు. బీఆర్ఎస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముండే విమలా బాయి, జడ్పీటీసీ, పార్టీ మండలాధ్యక్షుడు అజయ్ కుమార్, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, కో-ఆప్షన్ సభ్యుడు అహ్మద్, పీఏసీ చైర్మన్ పెంటు, ఆసిఫాబాద్ పీఏసీసీ చైర్మన్ అలీబిన్ అహ్మద్, పీఏసీసీ వైస్ చైర్మన్ నేపాజీ, ఎంపీటీసీలు హీవ్రే ప్రవీణ్, మాజీ ఎంపీటీసీలు బిలాజీ, వినోద్, సర్పంచ్‌లు బండే తుకారాం, సయ్యాద్ అయూబ్, ఎస్ దౌలత్ రావు, గంగుబాయి, ఉప సర్పంచ్ సయ్యద్ ఇమామ్, బీఆర్ఎస్ నాయకులు ముండే దీపక్, సదాశివ్, వేణుగోపాలా చారి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన మండలంలో..

రెబ్బెన, అక్టోబర్ 18 : రెబ్బెన మండలంలోని రాంపూర్, నవ్వేగాం, వంకులం, రాళ్లపేట గ్రామాల్లో బుధవారం రాత్రి జడ్పీ చైర్‌పర్సన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హారతి పట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే గ్రామాలు మరింత అభివృద్ధి పథంలోకి దూసుకుపోతాయని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు చేసే మ్యానిఫెస్టో పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్ రెడ్డి, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జడ్పీటీసీ వేముర్ల సంతోష్, పీఎస్‌సీఎస్ చైర్మన్ కార్నాదం సంజీవ్ కుమార్, సర్పంచులు వడ్డె మాధవి, జగన్నాథం, ఎంపీటీసీ దోమల సంధ్యారాణి పాల్గొన్నారు.

అభివృద్ధిని కొనసాగిస్తా..

చింతలమానేపల్లి : ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నందికొండ గ్రామస్తులు

- సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- నందికొండ గ్రామంలో ప్రచారం
- బీజేపీ, బీఎస్పీ నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

చింతలమానేపల్లి, అక్టోబర్ 18 : మరోసారి ఆదరించండి.. అభివృద్ధిని కొనసాగిస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రజలను కోరారు. చింతలమానేపల్లి మండలం బాబాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నందికొండ గ్రామంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ముందుగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ పార్టీ బీ-ఫాం తీసుకున్న మొదటిసారి గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కోనప్పను మహిళలు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేలా అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లిన ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రైతుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేశారని తెలిపారు. నందికొండ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని తెలిపారు. ఊరంతా తన వెంటే ఉండడం చాలా సంతోషంగా ఉందనానరు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని కోరారు. అనంతరం కౌటాల మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో చింతలమానేపల్లి మండలం కర్జెల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు డోకే మల్లేష్‌తో పాటు బాబాసాగర్ గ్రామానికి చెందిన గ్రామస్తులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య, నాజీమ్ హుస్సేన్, డుబ్బుల వెంకయ్య, బీంకరి నారాయణ, రామయ్య, కోటేశ్, విఘ్నేష్, రామయ్య, సాగర్, రాహుల్, బాపు, సత్తయ్య, డోకె నారాయణ, గణేశ్, జెల్లా నాని, సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీ చేరికలు..

కౌటాల, అక్టోబర్ 18 : ఎన్నికలు సమీపిస్తున్న వేల బీఆర్ఎస్‌లోకి వలసలు భారీగా పెరుగుతున్నాయి. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో కౌటాల మండల కేంద్రంలోని ఆయన నివాసంలో బీజేపీ, బీఎస్పీ పార్టీల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కౌటాల మండలం గురుడుపేట, చింతలమానెపల్లి మండలం బాబాసాగర్, కర్జెల్లి గ్రామాల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కోనప్ప గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ పాలనలో పల్లెలన్నీ ఊహించని అభివృద్ధి సాధించాయన్నారు. ప్రజలందరికీ పాలనా సులభమయ్యేందుకు నూతన పంచాయతీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎవరూ ఊహించని అభివృద్ధి జరిగిందన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాలను ఇతర పార్టీలు కాపీ కొడుతున్నాయని పేర్కొన్నారు. మ్యానిఫెస్టోలో పెట్టని పథకాలను కూడా అమలు చేసిందని ఆయన గుర్తు చేశారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి, భారీ మెజారిటీతో తనను గెలిపించి, అభివృద్ధిని చూడాలని కోరారు. ఆయన వెంట కౌటాల, చింతలమానేపల్లి మండలాల ఎంపీపీలు బసార్కర్ విశ్వనాథ్, డుబ్బుల నానయ్య, ఇరు మండలాల ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులున్నారు.

ప్రచార రథానికి పూజలు చేస్తున్న కోనేరు కృష్ణారావు, కోనేరు వంశీ దంపతులు

కోనప్ప ప్రచార రథం ప్రారంభం

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, అక్టోబర్ 18 : శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ ఒక్క అడుగు ముందుకేసి ప్రచారంలో దూసుకుపోతున్నది. ఇందులో భాగంగా సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఎన్నికల ప్రచారం కోసం అలంకరించిన ప్రచార రథానికి కాగజ్‌నగర్ మండలం పెద్దవాగు సమీపంలో గల శ్రీశ్రీశ్రీ గాంధారి మైసమ్మ ఆలయంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణా రావు దంపతులు, కోనేరు ట్రస్ట్ చైర్మన్ కోనేరు వంశీ దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అనంతరం కృష్ణారావు రావు రథసారథిగా స్టీరింగ్‌పై కూర్చొని ఓంకారం భక్తి పాట పెట్టి ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దుర్గాదేవి దీక్షాపరులు సంజయ్ సింగ్, వనమాల రాము, చల్లగుండ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి బీజేపీ నాయకుడు..

కాగజ్‌నగర్, అక్టోబర్ 18 : కాగజ్‌నగర్ మండలం రాస్పల్లి గ్రామానికి చెందిన బీజేపీ యువ నాయకుడు బీఆర్ఎస్ పార్టీలో చేరాడు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసంలో జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై పార్టీలో చేరినట్లు చెప్పారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుపొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ మండల కో ఆప్షన్ సభ్యుడు కిజర్ హుస్సేన్, నాయకులు నాని, శ్రీకాంత్, ఉమాకాంత్, తాజ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన బీజేపీ యువ నాయకుడు